క్లుప్తంగా

అశ్వవాహనంపై సంగమేశ్వరుడు



సంగం : మండలంలోని పినాకినీ తీరంలో వెలసిన సంగమేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి అశ్వవాహనంపై స్వామి, అమ్మవార్లు భక్తులకు దర్శనమిచ్చారు. గత మూడు రోజుల నుంచి జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా ఆలయంలోని కామాక్షిదేవి సమేత సంగమేశ్వర స్వాముల ఉత్సవమూర్తులను విశేష పూలతో అశ్వవాహనంపై ఆశీనులు చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు జరిపిన అనంతరం దేవదేవేరుల గ్రామోత్సవాన్ని ప్రారంభించారు. భక్తులు తెల్లవారుజాము వరకు మేల్కొని స్వామివార్లకు కొబ్బరికాయలు సమర్పించి కర్పూర హారతులు ఇచ్చారు. ఉత్సవం మంగళవారం తెల్లవారుజామున తిరిగి ఆలయానికి చేరింది. ఎస్సై రాజేష్ గట్టి పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

పసుపు పంట పరిశీలన



ఉదయగిరి : మండలంలోని బండగానిపల్లి, జి.చెరువుపల్లి పంచాయతీల్లో సాగులో ఉన్న పసుపు పొలాలను ఉద్యానాధికారి వీహెచ్ పూజిత మంగళవారం సందర్శించి రైతులకు పలు సూచనలిచ్చారు. గతేడాదితో పోల్చుకుంటే ప్రస్తుతం పసుపు దిగుబడి అధికంగా ఉందని, ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్ల దిగుబడి వచ్చిందని రైతులు తెలిపారు. అనంతరం పసుపును ఉడకబెట్టే యంత్రాన్ని ఆమె పరిశీలించారు. పసుపు కొమ్ములు త్రవ్విన తర్వాత ఉడికించి ఆరబెట్టాలని, ఆలస్యం చేస్తే నాణ్యత తగ్గే అవకాశముందన్నారు. ఆమె వెంట వీఏఏ కనిష్క ఉన్నారు.

రామాలయంలో ప్రత్యేక పూజలు



వరికుంటపాడు : స్థానిక కోదండరామస్వామి ఆలయంలో జరుగుతున్న నవమి ఉత్సవాల్లో భాగంగా నాలుగో రోజు మంగళవారం స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామోత్సవం గావించారు. భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఉభయకర్తలుగా యాదవులు వ్యవహరించారు.

సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు



ఆత్మకూరు : పట్టణ పరిధిలోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మంగళవారం మరమ్మతులు చేశారు. పట్టణ ఏఈ జమీలాబేగం నేతృత్వంలో మరమ్మతు పనులు సాగాయి. దీంతో ఉదయం 12 నుంచి మధ్యాహ్నం 4 గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. లైన్లు ట్రిప్ కావడం, సరఫరాలో అంతరాయాలు లాంటివి జరగకుండా మరమ్మతు పనులు చేయిస్తున్నట్లు ఏఈ తెలిపారు.

సమయపాలన పాటించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ పద్మజాకుమారి

వింజమూరు(ఉదయగిరి) : అంగన్‌వాడీ కేంద్రాలు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విధిగా సమయపాలన పాటించాలని సీడీపీఓ పద్మజాకుమారి అన్నారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సూపర్‌వైజర్లు, కార్యకర్తలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ లబ్ధిదారులకు పౌష్టికాహారం సక్రమంగా అందేలా చర్యలు చేపట్టాలన్నారు. తల్లీబిడ్డ సంరక్షణకు అవసరమైన పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

గుర్తుతెలియని మహిళ మృతి



కావలి : కావలి రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారంపై గుర్తుతెలియని 35 ఏళ్ల మహిళ మృతిచెందినట్లు రైల్వే ఎస్సై ఐ.రమాదేవి మంగళవారం చెప్పారు. ఎత్తు 5.6 కలిగి మెరూన్ రంగు నైటీ, ఎరుపు పచ్చ రంగు దుప్పటి ఆమె శరీరంపై ఉందని తెలిపారు. మహిళ ఆచూకీ తెలిసిన వారు కావలి రైల్వే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రహదారులే కల్లాలు

- ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు వసతులు శూన్యం
- దీనావస్థలో రైతులు



నెల్లూరు–ముంబై హైవేపై ఉడ్‌హౌస్‌పేట వద్ద ధాన్యాన్ని ఆరబోసిన రైతులు

సంగం : రైతులు పండించిన ధాన్యాన్ని ఆరబోసేందుకు వసతులు లేకపోవడంతో రహదారులే కల్లాలుగా మారాయి. సంగం మండలంలో ఉడ్‌హౌస్‌పేట, ర్యాంపు, సిద్ధీపురంతో పాటు నెల్లూరు – ముంబై జాతీయ రహదారిపై నిత్యం వందలాది పుట్ల ధాన్యాన్ని రైతులు ఆరబోసుకుంటున్నారు.

వేధిస్తున్న నిబంధనలు

మండల పరిధిలో సుమారు ఐదు వేల హెక్టార్లలో వరిసాగు జరిగింది. అయితే ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లో విక్రయించేందుకు తేమ 17 శాతంలోపు ఉండాలనే నిబంధన ఉంది. దీనివల్ల రైతులు తమ ధాన్యాన్ని ఆరబోయాల్సిన పరిస్థితి ఏర్పడింది. అయితే మండలంలో ఎక్కడా ధాన్యాన్ని ఆరబోసుకునేందుకు అధికారులు కల్లాలను ఏర్పాటు చేయలేదు. దీంతో అన్నదాతలు తాము కోసిన ధాన్యం విధిలేని పరిస్థితుల్లో నిత్యం రహదారులపై ప్రమాదాలు జరుగుతున్నా, ప్రమాదం పొంచి ఉందని తెలిసినా తప్పనిసరి పరిస్థితుల్లో ధాన్యం రాశులను ఆరబోసుకుంటున్నారు. పచ్చి ధాన్యాన్ని అమ్మబోతే పుట్టికి 100 నుంచి 120 కిలోలు అదనంగా ఇవ్వాలని మిల్లర్లు డిమాండ్ చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి గింజను మద్దతు ధరతో కొనుగోలు చేసి 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో నగదు జమ చేస్తున్నామన్న పాలకులు, అధికారులు పత్తా లేకపోవడంతో అన్నదాతలు ధాన్యాన్ని రహదారిపై ఆరబోసి పడిగాపులు కాయాల్సిన దుస్థితిలో ఉన్నామని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. కల్లాలతో పాటు గోదాములను సైతం అందుబాటులోకి తెచ్చి అన్నదాతలను ఆదుకోవాల్సిన అవసరం ఉంది. కూటమి ప్రభుత్వం కల్లబొల్లి మాటలు ఆపి రైతులను ఆదుకునే విషయంలో శ్రద్ధ చూపాలని అన్నదాతలు కోరుతున్నారు.



ర్యాంపు వద్ద రోడ్డుపై ఆరబోసిన ధాన్యాన్ని కలియబెడుతున్న కూలీలు

రెండో పంటకూ సాగునీరు



మాట్లాడుతున్న కేశవ చౌదరి

ఆత్మకూరు(చేజర్ల) : సోమశిల జలాశయంలో తగినంత నీరు ఉన్న నేపథ్యంలో రెండో పంటకూ సాగునీటిని విడుదల చేస్తామని సోమశిల ప్రాజెక్ట్ చైర్మన్ వి.కేశవ చౌదరి తెలిపారు. చేజర్ల మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం సాగునీటి సంఘాల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొలికారు వరికోతలు 90 శాతం పూర్తయ్యాయని, జిల్లా నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై రెండో కారుకు సాగునీరు విడుదల చేసేందుకు ప్రణాళికలు రూపొందించనున్నట్లు తెలిపారు. పలుచోట్ల కాలువల మరమ్మతులు పూర్తి చేయాలన్నారు. సాగునీరు వృథా కాకుండా గ్రామాల రైతులు చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో పలువురు సాగునీటి సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

భారీ చెట్ల నరికివేత



వరికుంటపాడు : మండలంలోని రామదేవులపాడు పిల్లాపేరు సమీపంలో ఉన్న భారీ చెట్లను అక్రమంగా నరికివేశారని పలువురు రైతులు తహసీల్దార్ హేమంత్‌కుమార్‌కు మంగళవారం ఫిర్యాదు చేశారు. వారం రోజుల క్రితం ప్రభుత్వ వాగు పోరంబోకులో ఉన్న మహావృక్షాలను కొంతమంది అక్రమంగా నరికి విక్రయించేందుకు ప్రయత్నించగా వీఆర్వో ప్రసాద్‌కు ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు చేపట్టలేదని తెలియజేశారు. వాల్టా చట్టం ప్రకారం మహా వృక్షాలను నరకడం చట్టరీత్యా నేరమని, అలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలి



మాట్లాడుతున్న శివకల్పన

ఉదయగిరి : మండలంలోని ఆశా, ఆరోగ్య కార్యకర్తలు వేసవిని దృష్టిలో ఉంచుకుని ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచుకోవాలని మండల వైద్యాధికారిణి ఎం.శివకల్పన పేర్కొన్నారు. స్థానిక సీహెచ్‌సీలో ఆశా కార్యకర్తల సమావేశాన్ని ఆమె మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి ఆశా కార్యకర్త వద్ద 200, విలేజ్ హెల్త్ క్లినిక్‌లో 500 ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలన్నారు. వడదెబ్బ సోకకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి కూలీలు, పాడిరైతులకు కూడా వీటిని అందించాలన్నారు. ఆశా కార్యకర్తలు కేటాయించిన యాప్‌లను అప్‌డేట్ చేసుకోవాలన్నారు. అనంతరం 18 మంది ఫైలేరియా రోగులకు కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శివకుమారి, హెచ్‌ఈ కె.వెంకటసుబ్బయ్య, సూపర్‌వైజర్లు చెన్నయ్య, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ భవనానికి ప్రతిపాదనలు



శిథిల భవనాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సీతారామపురం : స్థానిక బస్టాండ్ సెంటర్‌లో గల ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్ స్థానంలో నూతన భవన సముదాయం నిర్మాణానికి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ఆదేశాల మేరకు ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నట్లు ఏపీ ఈడబ్ల్యూఐడీసీ డీఈ సుబ్బారావు అన్నారు. సీతారామపురంలోని శిథిల దశకు చేరిన ఎస్సీ కార్పొరేషన్ కాంప్లెక్స్ భవనాన్ని ఏఈ శ్రావణ్ కుమార్‌తో కలిసి ఆయన మంగళవారం పరిశీలించారు. భవనం పొడవు, వెడల్పు, ఎత్తు తదితర వాటి వివరాలు సేకరించి అంచనాలను తయారు చేసి సమగ్ర నివేదికను ఎస్సీ కార్పొరేషన్ ఈడీకి అందిస్తామన్నారు. వారి ఆదేశాల మేరకు పాత భవన సముదాయాన్ని కూల్చివేసి కొత్త కాంప్లెక్స్‌ను నిర్మిస్తామన్నారు.

ఫైలేరియా కిట్ల పంపిణీ



వరికుంటపాడు : కిట్లు అందుకున్న బాధితులతో వైద్యసిబ్బంది



సంగం : కిట్లను అందజేస్తున్న డాక్టర్ శ్రీనివాసులురెడ్డి

సంగం : సంగం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శ్రీనివాసులురెడ్డి ఆధ్వర్యంలో ఫైలేరియా బాధితులకు మంగళవారం కిట్లను అందజేశారు. ముందుగా వైద్య సిబ్బంది ఫైలేరియా నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి తెలిపారు. ఫైలేరియా కిట్ల వాడకం గురించి అవగాహన కల్పించారు. మండలంలో 115 మంది ఫైలేరియా బాధితులు ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఖాదర్‌బాష, జలీల్, మాధవ తదితరులు ఉన్నారు.

- వరికుంటపాడు : మండలంలోని ఫైలేరియా బాధితులకు అవసరమైన చికిత్స కిట్లను మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో వైద్యాధికారిణి కరిష్మా, మలేరియా సబ్ యూనిట్ అధికారి నౌషాద్‌బాబు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాధితులు ప్రతిరోజు చికిత్స చేసుకుని శుభ్రం చేసుకునేందుకు అవసరమైన టబ్, మగ్, టవల్, ఆయింట్‌మెంట్, సబ్బులను అందించామన్నారు. మండలంలో 61 మంది బాధితులు ఉన్నారన్నారు. అనంతరం ఆశా డే కార్యకర్తల సమావేశాన్ని మండల వైద్యాధికారిణి కరిష్మా నిర్వహించారు. వేసవిలో వడదెబ్బ తగలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ రాజశేఖరరాజు, సూపర్‌వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలు దగ్ధం



సీతారామపురం : స్థానిక పోస్టాఫీసు సమీపాన ఉండే వీధిలో గుజ్జుల శ్రీనివాసులు ఇంట్లో మంగళవారం వేకువజామున విద్యుత్ షార్ట్‌సర్క్యూట్‌తో గృహోపకరణాలతో పాటు ఆస్తి నష్టం వాటిల్లింది. స్థానికుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. శ్రీనివాసులు–రత్తమ్మ దంపతులు జీవనోపాధి కోసం తిరుపతిలో ఉంటుండగా వారి పిల్లలు బంధువుల సంరక్షణలో స్థానికంగా ఇంట్లోనే ఉంటున్నారు. ఈ తరుణంలో పిల్లలు ఇంటి బయట నిద్రిస్తుండగా అర్ధరాత్రి సమయంలో ఇంట్లో ఒక్కసారిగా మంటలు చెలరేగి పొగలు వస్తుండడంతో చుట్టుపక్కల వారు మేల్కొని మంటలను అదుపు చేశారు. ఇంట్లోని టీవీ, ఫ్యాన్లు, ఫ్రిజ్ తదితర గృహోపకరణాలతో పాటు దుస్తులు, పాత్రలు, ఇతర సామగ్రి కాలిపోవడంతో సుమారు రూ.2 లక్షల మేరకు ఆస్తి నష్టం వాటిల్లిందని బాధితులు గగ్గోలు పెడుతున్నారు.

చెన్నకేశవుని బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

ఉదయగిరి(వింజమూరు) : వింజమూరులోని యర్రబల్లిపాళెంలో వెలసిన శ్రీదేవి భూదేవి సమేత చెన్నకేశవస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు మంగళవారం అంకురార్పణ గావించారు. ఆలయ ధర్మకర్త గణపం సుదర్శన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముందుగా పుట్టమట్టి తీసుకొని ఆలయానికి చేరుకున్నారు. కుమ్మరివారి ఇంటికి వెళ్లి మట్టికుండలను తీసుకొచ్చి వాటిలో పుట్టమట్టి పెట్టి దానిపై నవధాన్యాలు చల్లి గణపతి పూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు జరిపించారు. యాద్నికస్వామి, సునీల్‌స్వామి, ఆలయ అర్చకుడు రంగనాథాచార్యులు శాస్త్రోక్తంగా కార్యక్రమాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

పేద మహిళలకు చీరల పంపిణీ



సోమశిల : మండల పరిధిలోని పాతాళపల్లి గ్రామంలో ఆగ్నేష్ ఎన్‌జీఓ కార్యాలయంలో 50 మంది పేద మహిళలకు మంగళవారం చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంస్థ అధ్యక్షుడు కానగల వెంకటరమణయ్య మాట్లాడుతూ తమ సంస్థ ద్వారా 230 మంది మహిళలకు కుట్టుమెషీన్‌లో శిక్షణ ఇచ్చామన్నారు. మరిన్ని సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ నోటి తిరుపతమ్మ, కృష్ణా తదితరులు పాల్గొన్నారు.

రైతులు విశిష్ట సంఖ్యను పొందాలి

వరికుంటపాడు : మండలంలో వ్యవసాయ పొలం ఉన్న ప్రతి రైతు విశిష్ట గుర్తింపు సంఖ్యను తప్పనిసరిగా పొందాలని మండల వ్యవసాయాధికారి వి.రవికుమార్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలో 7,756 మంది రైతులు ఉన్నారన్నారు. ఇప్పటివరకు 4,200 మంది రైతుల వివరాలను నమోదు చేశామన్నారు. మిగిలిన వారు రైతుసేవా కేంద్రాల్లోని గ్రామ వ్యవసాయ సహాయకులను సంప్రదించి నమోదు చేసుకుని గుర్తింపు సంఖ్యను పొందాలన్నారు.

ఆలయాభివృద్ధిపై అధికారుల పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న దేవదాయశాఖ డీఈ

సంగం : సంగం శివాలయంలో ఉన్న పాకనాటి పతివ్రతమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ డీఈ శ్రీనివాసులు మంగళవారం పరిశీలించారు. ఆలయంలో చేపట్టాల్సిన అభివృద్ధిపై గ్రామస్తులు, నిర్వాహకులతో చర్చించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదేశాలతో నియోజకవర్గంలో 80 దేవాలయాలను అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. మండలంలో 15 దేవాలయాలను అభివృద్ధి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఈ మురళి, టీడీపీ నాయకులు శ్రీనివాసులుయాదవ్, బాణా శ్రీనివాసులురెడ్డి, పట్టాభిరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి దుర్మరణం



మర్రిపాడు : మండలంలోని కృష్ణాపురం సెంటర్‌లో సోమవారం రాత్రి రోడ్డు ప్రమాదం జరిగింది. ద్విచక్ర వాహనాన్ని పుచ్చకాయల లోడుతో వెళ్తున్న టాటా మ్యాజిక్ ట్రాలీ ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై ఉన్న బ్రాహ్మణపల్లి గ్రామానికి చెందిన వీరయ్య(46) అనే వ్యక్తి అక్కడికక్కడే మృతిచెందాడు. వెనుక కూర్చున్న సమీప బంధువు రమీజా అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

తల్లీబిడ్డల శ్రేయస్సే ముఖ్యం

- డీఎంహెచ్‌ఓ సుజాత



మాట్లాడుతున్న సుజాత

అనుమసముద్రంపేట : తల్లీబిడ్డల శ్రేయస్సే వైద్యసిబ్బందికి ముఖ్యమని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి(డీఎంహెచ్‌ఓ) సుజాత అన్నారు. ఏఎస్‌పేటలోని ప్రభుత్వ వైద్యశాలను ఆమె మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లతో సమావేశమయ్యారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాలల్లో కాన్పులు చేసేలా గర్భిణులకు అవగాహన కల్పించాలని తెలిపారు. గృహ సందర్శన చేసి గర్భిణులు ఎంత మంది ఉన్నారో తెలుసుకుని ప్రభుత్వ వైద్యశాలలో వారికి అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో వైద్యులు సురేష్‌బాబు, మంజులమ్మ, ఇతర వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

మండుటెండలో విద్యార్థుల అవస్థలు



బస్సు కోసం ఎండలో వేచి ఉన్న విద్యార్థులు

- బస్సు నిలపకపోవడంతో తప్పని తిప్పలు

వరికుంటపాడు : మండల కేంద్రమైన వరికుంటపాడు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మండుటెండలో అవస్థలు తప్పడం లేదు. ఇక్కడి పాఠశాలలో కాంచెరువు, గువ్వాడి, బోయమడుగుల, మంగాపురం, జడదేవి తదితర గ్రామాల విద్యార్థులు చదువుకుంటున్నారు. ప్రస్తుతం ఒంటిపూట బడులు జరుగుతుండడంతో మధ్యాహ్నం ఇళ్లకు వెళ్లేందుకు బస్టాండ్ సెంటరుకు విద్యార్థులు రాగా గువ్వాడి మార్గం వైపు వెళ్లే ఆర్టీసీ బస్సు ఇక్కడ నిలుపడం లేదు. దీంతో విద్యార్థులు మండుటెండలో రోడ్డుపై నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. తప్పనిసరి పరిస్థితుల్లో కొందరు విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో ఇళ్లకు వెళ్తున్నారు. దీనిపై విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై డీఎం ఎం.శ్రీనివాసరావును వివరణ కోరగా విద్యార్థులకు ఇబ్బంది కలగకుండా విజయవాడ బస్సులో విద్యార్థులు తమ గ్రామాలకు వెళ్లేలా డ్రైవర్లను ఆదేశించి ఉన్నామన్నారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చూస్తామన్నారు.

పక్కాగృహాలను పూర్తి చేసేలా చర్యలు



వరికుంటపాడు: సమావేశం నిర్వహిస్తున్న డీఈ



ఆత్మకూరు : నిర్మాణాలను పరిశీలిస్తున్న అధికారులు

వరికుంటపాడు : మండలంలో పురోగతిలో ఉన్న 35 పక్కా గృహాలను జూన్‌లోగా పూర్తిచేసేలా క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని హౌసింగ్ డీఈ పీరాన్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, సచివాలయ సిబ్బందితో కలిసి హౌసింగ్‌పై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణంలో ఉన్న పక్కాగృహాలకు ప్రభుత్వం అదనంగా ఎస్సీ, బీసీలకు రూ.50 వేలు, ఎస్టీలకు రూ.75 వేలు ఆర్థిక సాయం చేస్తున్నందున లబ్ధిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు తక్కువగా ఉన్నందున మిగతా సచివాలయ సిబ్బందిని ఉపయోగించుకొని త్వరితగతిన లక్ష్యాలను పూర్తి చేసేలా చూడాలని ఎంపీడీఓ వేణుగోపాల్‌ను కోరారు.

జూన్ నాటికి పూర్తిచేయాలి

ఆత్మకూరు : ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాలను జూన్ 1వ తేదీ నాటికి పూర్తి చేయాలని ఎస్సీ, ఎస్టీ, బీసీ లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ డివిజన్ ఈఈ మోహన్‌రావు అన్నారు. డీఈ గౌస్ మొహిద్దీన్, ఏఈ ఎండీ జమీల్‌తో కలిసి ఆయన మున్సిపల్ పరిధిలోని నెల్లూరుపాళెం, పమిడిపాడు, జగనన్న లేఅవుట్‌లలో ఇళ్ల నిర్మాణాలపై మంగళవారం పర్యవేక్షించారు. అర్ధాంతరంగా నిలిచిపోయిన ఇళ్ల పనులను పరిశీలించి లబ్ధిదారులకు పలు సూచనలు చేశారు. ఆత్మకూరు మున్సిపల్ పరిధిలో నాలుగు లేఅవుట్‌లను గత ప్రభుత్వం ఏర్పాటు చేసిందని, 2,284 మందికి పట్టాలు అందజేసినట్లు తెలిపారు. అందులో 810 ఇళ్లు కాంట్రాక్టర్ల ద్వారా నిర్మించుకొనేలా అప్పట్లో నిర్ణయించారని, అవి సైతం అర్ధాంతరంగా నిలిచిపోయినట్లు తెలిపారు. సంబంధిత కాంట్రాక్టర్లతోనూ మాట్లాడినట్లు తెలియజేశారు. ఆర్థిక సాయాన్ని పొందనున్న లబ్ధిదారులు రెండు నెలల వ్యవధిలో ఇళ్ల నిర్మాణాలను తప్పనిసరిగా పూర్తి చేసుకోవాలన్నారు. తొలుత ఆయన హౌసింగ్ కార్యాలయంలో సిబ్బందితో సమావేశం నిర్వహించారు.

నర్సు ఫిర్యాదుపై రెండోసారి విచారణ



ఆస్పత్రిలో విచారణ చేస్తున్న డీఎంహెచ్‌ఓ

అనుమసముద్రంపేట : ఏఎస్‌పేట మండల కేంద్రంలోని వైద్యశాలలో పనిచేస్తున్న ఓ కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు ఇచ్చిన ఫిర్యాదుపై రెండోసారి విచారణ జరిగింది. ఇక్కడి కాంట్రాక్ట్ స్టాఫ్ నర్సు లక్ష్మికి డాక్టర్లు సెలవులు ఇవ్వడం లేదని ఇటీవల జిల్లా అధికారులకు స్పందనలో ఫిర్యాదు చేశారు. దీనిపై ఆత్మకూరు ఆర్డీఓ పావని ఆధ్వర్యంలో ఐదుగురు జిల్లా అధికారులతో విచారణ కమిటీని వేశారు. వీరు మంగళవారం ఏఎస్‌పేటలోని పీహెచ్‌సీకి వచ్చి విచారణ చేశారు. కాగా రెండు నెలల క్రితం కావలి డిప్యూటీ డీఎంహెచ్‌ఓ ఆధ్వర్యంలో ఇదే అంశంపై విచారణ చేశారు. అయితే తనకు న్యాయం జరగలేదని నర్సు లక్ష్మి మరోసారి జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆర్డీఓ పావనితో పాటు డీఎంహెచ్‌ఓ సుజాత, సోషల్ వెల్ఫేర్ డీడీ శోభారాణి, ఏపీఎంఐడీ అధికారి శ్రీనివాసరావులను విచారణ కమిటీగా ఏర్పాటు చేశారు. వీరు వైద్యులు సురేష్‌బాబు, మంజుల, స్టాఫ్ నర్సులు లత, లక్ష్మిలను విడివిడిగా విచారణ చేశారు. అందరి అభిప్రాయాలను కమిటీకి తెలియజేశారు.